క్లుప్తంగా

నేత్ర శస్త్రచికిత్సకు 8 మంది ఎంపిక


వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు వసంతరావు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన 22 మందికి కంటి పరీక్షలు చేసి, 8 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్లు ఆప్తాల మిక్ అధికారి ఎస్.వసంతరావు తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ తిరుపతినాయుడు

రేగిడి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈఓ ఎస్.తిరుపతినాయుడు సూచించారు. శుక్రవారం మండలంలోని కోడిశ, కందిశ గ్రామ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన తరగతి గదులకు వెళ్లి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరాతీశారు. అనంతరం ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్, డైరీలు, లిప్ రికార్డ్స్‌ను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్.రవిరాజు, కె.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

వంగర: మండలంలోని కింజంగి గ్రామంలో చిరుధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్ చిరుధాన్యాల సాగు వల్ల నేల సారవంతం కావడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యంపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో రైతు మిత్ర వై.రాము, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


రికార్డులు పరిశీలిస్తూ విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పరవలస గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు వండి పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నాగభూషణదొర తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి


పెద్దశిర్లాం సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు

రేగిడి: గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దశిర్లాం, బూరాడ, పారంపేట గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.

పాఠశాల పరిశీలన


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ లక్ష్మణరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారి సామర్థ్యాలను అంచనా వేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంకండి..

జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది నాడు చేపట్టనున్న సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని అధికారులు సూచించారు. గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న నిర్మాణాలను అధికారులు శుక్రవారం పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కాలనీల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్


బాడంగి: గూడెపువలసలో హౌసింగ్ డేలోమాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి


తెర్లాం: మండల కేంద్రంలో హౌసింగ్ డేలో పాల్గొన్న డీఈఈ పలగర అప్పయ్య


రాజాం: బొద్దాం లే అవుట్ వద్ద గృహ నిర్మాణాల వేగవంతంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


రేగిడి:లో నిర్వహిస్తున్న హౌసింగ్ డే కార్యక్రమంలో ఏఈ సూర్యప్రకాష్

భూముల రీ సర్వే వేగవంతం

- ఆర్డీఓ శేషశైలజ


అధికారులతో మాట్లాడుతున్న బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ

తెర్లాం: వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను మరింత వేగవంతం చేయాలని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. మండలంలోని నందిగాంలో జరుగుతున్న భూముల సరిహద్దుల గుర్తింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది.. ఇంకా ఎన్ని గ్రామాల్లో సర్వే చేపట్టాలన్న విషయాలపై తహసీల్దార్ డోల రాజేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. మండలంలో ప్రస్తుతం పూనువలస, విజయరాంపురం, నందిగాం గ్రామాల్లో జరుగుతున్న గ్రౌండ్ ట్రూథింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. భూముల రీసర్వే పూర్తయితే గ్రామాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్ఓలు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు టెస్ట్ పేపర్లు పంపిణీ చేస్తున్న పువ్వల వెంకటరమణ, యూటీఎఫ్ సభ్యులు

రామభద్రపురం: పదో తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పువ్వల వెంకటరమణ సూచించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పువ్వల వెంకటరమణ, జ్యోతి దంపతులు మండలంలోని రొంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాలరావు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మీపతిరాజు

తెర్లాం: కొలతల ప్రకారం పనులు చేయిస్తే రోజుకు 257 రూపాయల వేతనం గిట్టుబాటు అవుతుందని ఉపాధి రాజాం క్లస్టర్ ఏపీడీ లక్ష్మీపతిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీఓ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సాంకేతిక, క్షేత్ర సహాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ, పనులకు హాజరైన వేతనదారుల హాజరు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో క్షేత్ర సహాయకులు వెంటనే నమోదు చేయాలని సూచించారు. వేతనదారులు రెండు పూటలా పనులు చేసేలా చూడాలన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి


గూడెపువలసలో ప్రకృతి వ్యవసాయిసాగుపై అవగాహన ర్యాలీ

బాడంగి: రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సాగు చేపట్టాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుడెపువలసలో వ్యవసాయాధికారి శిరీష పర్యవేక్షణలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ.సతీష్, యూనిట్ ఇన్‌చార్జ్ వై.ఈశ్వరరావు, ఆర్.రమణ, అప్పలనాయుడు, ఐసీఆర్‌పీ చైతన్య, సీహెచ్.జయలక్ష్మి, డి.వెంకటరమణ, చిన్నారావు, రైతులు పాల్గొన్నారు.

'నవధాన్యాలు సాగు చేద్దాం-నేలతల్లిని కాపాడుదాం'

సంతకవిటి: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్‌ఎఫ్ శారద అన్నారు. శుక్రవారం మండలంలోని గోవిందపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నవధాన్యాలు సాగు చేద్దాం-నేలతల్లిని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగోలు పద్మజ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సరస్వతి, అప్పలనాయుడులు, ఐసీఆర్‌పీ వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రి మృతి


కొడుకు మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

రాజాం సిటీ: పట్టణంలోని మాధవబజార్‌లో భవన నిర్మాణం పనులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో తాపీమేస్త్రి కొయ్యాన ఆదినారాయణ(35) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామానికి చెందిన ఆదినారాయణ భార్యాపిల్లలతో విశాఖపట్నంలో ఉంటూ తాపీపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల గ్రామంలోని బంధువుల పెళ్లికి కుటుంబ సభ్యులతో వచ్చిన అతడు ఖాళీగా ఉండడమెందుకని శుక్రవారం రాజాం పనికి వెళ్లాడు. భవనం పైఅంతస్తులో పనులు చేస్తూ అక్కడి విద్యుత్ తీగలకు తగిలి కింద పడిపోయాడు. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతునికి భార్య నాగమణి, ఓ కొడుకు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

సంగాం యాత్రకు పటిష్ట బందోబస్తు


సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ ఉపేంద్ర

వంగర: మండలం సంగాంలోని సంగమేశ్వరస్వామి యాత్రకు సంబంధించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాజాం రూరల్ సీఐ సీహెచ్ ఉపేంద్ర తెలిపారు. ఏడు రోజుల పాటు ఇక్కడ జరిగే యాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో వంగర, రేగిడి ఎస్‌ఐలు లోకేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సారా రహిత సమాజానికి కృషి

- ఎస్‌ఈబీ సూపరింటిండెంట్ శైలజారాణి



బొబ్బిలి: సారా రహిత సమాజానికి తాము కృషి చేస్తున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ డి. శైలజారాణి అన్నారు. శుక్రవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో 10 ఎస్‌ఈబీ స్టేషన్లు, 26 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. సారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆపరేషన్ పరివర్తన పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విజయనగరాన్ని డ్రగ్ ఫ్రీ జిల్లాగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆమెతో పాటు సీఐ ఆర్.జైభీమ్ పాల్గొన్నారు.

కంచాల వితరణ

రాజాం: స్థానిక భవిత కేంద్రానికి సంతకవిటి మండలంలోని వాల్తేరు గ్రామానికి చెందిన గురుగుబెల్లి చిన్నికృష్ణంనాయుడు భోజనం కంచాలు, బ్లాక్ అండ్ వైట్ చాక్‌బోర్డులను శుక్రవారం వితరణ చేశారు. అనంతరం గార్రాజుచీపురుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి పూజలకు అంకురార్పణ


శివరాత్రి సంబరాలలో మాట్లాడుతున్న ఓంశాంతి సిస్టర్ రాజేశ్వరి

బొబ్బిలి: పట్టణంలోని యుద్ధస్తంభం వద్ద ఓంశాంతి ఆధ్వర్యంలో శివరాత్రి సంబరాలకు అంకురార్పణ చేశారు. ఓంశాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సిస్టర్ రాజేశ్వరి శుక్రవారం సాయంత్రం ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శివస్తుతి అందరికీ మేలు చేస్తుందన్నారు.

సమస్యలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న అర్బన్ సీడీపీఓ విజయకుమారి

బొబ్బిలి రూరల్: బాలికలు ఎదుర్కొనే సమస్యలపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ విజయకుమారి సూచించారు. పాతబొబ్బిలిలో శుక్రవారం నిర్వహించిన సఖి సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లల భద్రత విషయంలో అంతా జాగ్రత్తలు పాటించాలని, బాలికలకు అన్ని విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు ఎదురైన సమయంలో బాలికలు భయపడకుండా కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగి మృతి


మాధవి(ఫైల్)

రాజాం సిటీ: మండల పరిధిలోని బొద్దాం గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి బానాన మాధవి(29) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమె శ్రీకాకుళం జిల్లాలోని వజ్రపుకొత్తూరు మండలం, గరుడభద్ర గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈమె ఇంటి వద్దనే ఉండి, చికిత్స పొందుతుండడం గమనార్హం.

శ్రమదానంతో వంతెన నిర్మాణం


సరసనాపల్లి నాగావళి నదిలో ఏర్పాటు చేసిన కర్రల వంతెన వద్ద యువకులు

రేగిడి: మండలంలోని సరసనాపల్లి గ్రామ వైఎస్సార్ యూత్ సభ్యులు శ్రమదానంతో కర్రల వంతెన నిర్మాణం చేపట్టి, అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వంగర మండలంలోని సంగాం వద్ద ఉన్న శివాలయానికి రేగిడి మండలంలోని సరసనాపల్లి, కందిశ, జోడుబందల, కోడిశ, తునివాడ గ్రామాలకు చెందిన భక్తులు వెళ్లాలంటే మడ్డువలస మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కర్రి జగదీష్, కడగల రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ యూత్ సభ్యులు నాగావళి నదిలో కర్రల వంతెనను ఏర్పాటు చేశారు. దీంతో సరసనాపల్లి నుంచి త్రివేణి సంగమం చేరుకునేందుకు భక్తులకు మార్గం సుగమమైంది. ఎటువంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని యూత్ సభ్యులు అన్నారు. 80 అడుగల పొడవైన ఈ కర్రల వంతెనను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామని తెలిపారు.

1900 ఇళ్లు సిద్ధం

- హౌసింగ్ డీఈఈ రత్నాకర్


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ రత్నాకర్

రామభద్రపురం: బొబ్బిలి అర్బన్, రామభద్రపురం మండలాల్లో 1900 జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని హౌసింగ్ డీఈఈ రత్నాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏఈఈ వై.సత్యారావునాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, రామభద్రపురం మండలంలో 1100, బొబ్బిలి అర్బన్‌లో 800 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ. 48.89 కోట్ల బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, రహదారులు, తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

'వైఎస్సార్ కల్యాణమస్తు'తో మేలు


లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా యువ జంటలకు మేలు కలుగుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 29వ వార్డుకు చెందిన అరిసెల లవకుమార్, ఉమ దంపతులకు రూ.75 వేల వైఎస్సార్ కల్యాణమస్తు చెక్‌ను శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన మొత్తాన్ని సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా మెలగాలి


తెర్లాం: మాట్లాడుతున్న జెడ్పీ మహిళా శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ శాంతకుమారి, పక్కన తెర్లాం ఎంపీపీ ఉమాలక్ష్మి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

బాడంగి: బాలికలు అన్ని విషయాల్లోనూ అప్రమత్తంగా మెలగాలని ఐసీడీఎస్ పీడీ బి. శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సఖీ గ్రూపులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలు గుడ్ టచ్/బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అమ్మాయిలు శారీరక దృఢత్వం కోసం ఎక్సర్‌సైజ్‌లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.త్రినాథరావు, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి, మహిళా పోలీస్ కొల్లి అనురాధ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..

తెర్లాం: గ్రామాల్లోని కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ఐసీడీఎస్, వైద్యశాఖాధికారులు, సచివాలయ మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని జెడ్పీ మహిళా సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, బొబ్బిలి జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.శాంతకుమారి, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. మండలంలోని కుమ్మరిపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో సఖీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికల ఆరోగ్యం పట్ల తగు సూచనలు, సలహాలు వైద్యశాఖ అధికారులు అందించాలన్నారు. కిశోర బాలికలంతా సఖీ గ్రూపుల్లో చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ జె.త్రినాథరావు, తెర్లాం, పెరుమాళి అంగన్‌వాడీ సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, చిట్టెమ్మ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, కేజీబీవీ సీఆర్‌టీలు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఔదార్యం


దాలినాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాలమ్మ, అప్పలనరసమ్మ

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటకు చెందిన భవన నిర్మాణాల కాంట్రాక్టర్ వావిలపల్లి దాలినాయుడు ఔదార్యం చాటుకున్నారు. ఇదే మండలంలోని తమరాం గ్రామానికి చెందిన సవలాపురపు కాలమ్మతో పాటు ఆమె తల్లి అప్పలనరసమ్మకి ఎటువంటి ఆధారం లేకపోవడంతో పూరిగుడిసెలో నివశిస్తున్నారు. వీరి నివాసాన్ని మరింత బలంగా నిర్మించేందుకు రూ.25 వేల నగదు వితరణ చేశారు. దీంతో పూరింటి గోడలకు సిమ్మెంట్ రేకులు, స్తంభాలను దాలినాయుడు సొంతంగా అమర్చారు. దీంతో తల్లీకూతుళ్లు దాలినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజాం: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ బి.జయప్రకాష్ కోరారు. శుక్రవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో వెలుగు అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకునేలా చూసే బాధ్యత వెలుగు అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో వెలుగు శాఖ రాజాం ఏసీ ఎ.చిరంజీవి, ఏపీఎం టి.దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షలకు చేరిన డ్వాక్రా అవకతవకలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన ఆర్పీ అవకతవకలు రూ. 18.21 లక్షలకు చేరాయని మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం తెలిపారు. తన పరిధిలోని గ్రూపు సభ్యులకు తెలియకుండా నగదు వాడుకున్న ఆమెపై విచారణ చేపట్టి ఇటీవల రూ. 5.79లక్షలు రికవరీ చేశామని చెప్పారు. బ్యాంకు అధికారుల నుంచి స్టేట్‌మెంట్‌లు తీసుకుని తనిఖీ చేపట్టగా ఇంకా రూ.12.42లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని పేర్కొన్నారు. ఇదే కాకుండా సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లోని నగదు కూడా గుర్తించగా ఆమె పరిధిలోని 25 గ్రూపులకు గాను 14 గ్రూపుల్లో ఈ అవకతవకలు జరిగినట్లు నిర్ధారించామని తెలిపారు. పూర్తిస్థాయిలో గ్రూపు సభ్యులు సహకరించి రికార్డులు తీసుకువస్తే ఆమె ఎంత మొత్తంలో అవినీతికి పాల్పడిందనే విషయం క్షుణ్ణంగా తెలుస్తుందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే మెప్మా పీడీతోపాటు, కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.